## క్లుప్తంగా

### పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**చీరాల టౌన్:** ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ సెక్రటరీ గౌస్‌బాషా అన్నారు. ఈపురుపాలెంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించి వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. సెక్రటరీ గౌస్‌బాషా పాల్గొన్నారు.

### నేడు కారంచేడులో స్పందన

**కారంచేడు:** మండల కేంద్రమైన కారంచేడు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎస్. వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వివిధ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. మండల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

### నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

**చీరాల టౌన్:** మండలంలోని కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీలు, మున్సిపల్ వార్డుల పరిధిలోని సచివాలయాల వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు.

### పేకాట శిబిరంపై దాడి



పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోనికి తీసుకున్న పోలీసులు

**చినగంజాం:** పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారంతో చినగంజాం పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కొమరిశెట్టి అందించిన సమాచారం ప్రకారం చినగంజాం పంచాయతీ పరిధిలోని బండకాలనీలో ముందు సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 4300 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ వి. శ్రీనివాసరావు, చిరంజీవి, కానిస్టేబుల్, డి. శ్రీనివాసరావు, చక్రవర్తి, చిన్న, హోంగార్డు కె. నాగరాజు, ఆర్. సతీష్ పాల్గొన్నారు.

### వ్యవసాయాధికారి బదిలీ

**పుల్లలచెరువు:** పుల్లలచెరువు వ్యవసాయాధికారి సుధీర్‌బాబు కారంచేడుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దర్శిలో పనిచేస్తున్న ఏవోను పుల్లలచెరువు బదిలీచేశారు. ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా మరియదాసు బాధ్యతలు స్వీకరించారు. పుల్లలచెరువు ఎంపీడీవోగా కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న ఈవోఆర్డీ నాగిరెడ్డికి పదోన్నతి కల్పించి పుల్లలచెరువు ఎంపీడీవోగా నియమించారు. ఆయన విధుల్లో చేరాల్సి ఉంది. పుల్లలచెరువు మండల భూసర్వే ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్‌గా మార్కాపురం ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ప్రభావతిని నియమించారు. ఆమె విధుల్లో చేరాల్సి ఉంది.

### అమ్మవారికి ప్రత్యేక పూజలు

**హనుమంతునిపాడు:** మండలంలోని దాసళ్లపల్లి గ్రామంలో దోమలేటి ఒడ్డున వెలసిన అంకాలమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం సిడిమాను ఉత్సవం భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి కొర్ల బండి, కుంకుమ బండ్లు, గ్రామోత్సవం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం నిర్వహించారు.

### ఘనంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణం

**గుడ్లూరు:** మండల పరిధిలోని మూర్తింపేట గ్రామంలో ఆదివారం వెంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు. వేదపండితులు భక్తులకు తాళిబొట్టు చూపించి ఘనంగా కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు వసంతోత్సవం, ఎనిమిది గంటలకు ధ్వజావరోహణం నిర్వహించారు. కార్యక్రమంలో సాలిపేట సర్పంచ్ చాపల రమణయ్య, భక్తులు పాల్గొన్నారు.



శ్రీనివాసుడి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# శోభాయమానంగా ఆలయాలు



మేదరమెట్ల దైవస్థానంలో సుందరంగా అలంకరించిన వెంకటేశ్వర స్వామి



వేటపాలెం: అమ్మవారికి పూజలు చేస్తున్న ఆర్‌డీఓ సరోజిని దంపతులు



వేటపాలెం: దువల మనుబ్రహ్మకి పూజల చేస్తున్న సమితి సభ్యులు

**వేటపాలెం:** దేవబ్రాహ్మణ (దేవాంగ) సామాజిక వర్గ వంశ మూల పురుషుడు దేవల మనుబ్రహ్మ జయంతిని జ్యోతిర్మయి దేవాంగ సమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. స్థానిక అణుమిల్లిపేటలో గల రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో గల దేవల మనుబ్రహ్మ స్వామికి సమితి ప్రతినిధులు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. సమితి అధ్యక్షుడు గౌరాబత్తుని రవిబాబు, ఉపాధ్యక్షులు బీరక పరమేష్, కొసనం నాగమాంబ, గుళ్లాపల్లి షణ్ముఖరావు, కోశాధికారి బుద్ధి మోహనరావు, నాసిక కోటి నాగేశ్వరరావు, బుడ్డు వెంకట సుబ్బారావు బొగ్గుల పార్థిసారధి పాల్గొన్నారు.

**కనక నాగవరపమ్మని దర్శించుకొన్న ఆర్‌డీఓ**

**వేటపాలెం:** మండల పరిధిలోని రామన్నపేట శివారులో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారిని బాపట్ల జిల్లా ఆర్‌డీఓ సరోజిని దంపతులు ఆదివారం దర్శించుకొన్నారు. అమ్మవారి శిడిమహోత్సవం సందర్భంగా ఆర్‌డీఓ కుటుంబ సమేతంగా అమ్మవారని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ జీవీఎల్ కుమార్ ఆర్‌డీఓ దంపతులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు బండ్ల వెంకటేశ్వర్లున్నారు.



అద్దంకి రూరల్: లక్ష తమలపాకులతో పూజ నిర్వహిస్తున్న అర్చకులు

**అన్నదాతలు సుభిక్షంగా ఉండాలి**

**కారంచేడు:** ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంత అన్నదాతలందరూ సుభిక్షంగా ఉండాలని రైతులు గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం గ్రామంలోని పుట్టాయిపాలెంలో కొలువైన గ్రామ దేవత పోలేరమ్మ, గంగమ్మ తల్లి గుడిలో రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది సాగులో మంచి అనుకూల వాతావరణం ఉండాలని, వరుణదేవుడు కరుణించి వర్షాలు బాగా కురవాలని, మంచి పంటలు పండి, దిగుబడులు పెరగాలని రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేయడం వలన అంతా మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం.

**నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు**

**మేదరమెట్ల:** స్థానిక అద్దంకి రోడ్డులో కొలువైయున్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 5వ తేదీ నుంచి 10 వరకు 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 5 సాయంత్రం అంకురార్పణ కార్యక్రమం, 6న ఆంజనేయస్వామివారికి అభిషేకం, 7న వెంకటేశ్వరస్వామి వారికి వివిధరకాల పూలతో అలంకరణ, 8న స్వామివారిని చందన అలంకారంతో భక్తులకు దర్శనం, 9న స్వామివారికి అభిషేకం, 10న స్వామివార్లకు దివ్య కల్యాణం ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

**అద్దంకి రూరల్:** శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి ఆదివారం పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా భట్టిప్రోలు ఫణికృష్ణ దంపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా ఏరువాక పౌర్ణమి



సూరేపల్లిలో ఉండ్రాళ్లు తీసుకెళుతున్న రైతులు

**అద్దంకి:** రైతన్నల పండగ ఏరువాకను రోటరీ క్లబ్ ఆఫ్‌శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని గోశాలలో గోపూజ చేశారు. అలాగే ఎద్దులను అలంకరించి అరకలు కట్టి ముందుకు సాగారు. దామావారిపాలేనికి చెందిన రైతులు ఆరు జతల ఎడ్లతో ఏరువాక సాగారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశానికే వెన్నుముకగా ఉన్న వ్యవసాయం అన్నారు. చుండూరి మురళీ సుధాకర్‌రావు, ఊటుకురి రామకోటేశ్వరరావు, మలాది శ్రీనివాసరావు, మన్నం త్రిమూర్తులు, చప్పిడి వీరయ్య, ఎండీ రఫీ, యు. శ్రీనివాసరావు, గోశాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**వాడవాడల ఏరువాక పౌర్ణమి**

**బల్లికురవ:** ఏరువాక పౌర్ణమి వేడుకలు ఆదివారం మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. సూరేపల్లి, ముక్తేశ్వరం, నక్కబొక్కలపాడు, చెన్నుపల్లి, గుంటుపల్లి, అంబడిపూడి, కొప్పరపాలెం, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, వల్లాపల్లి, అంబడిపూడి గ్రామాల్లో ఎడ్లను ప్రత్యేకంగా అలంకరించి పొలాలకు తోలుకెళ్లి వ్యవసాయ పనులు చేపట్టారు. ఆయా గ్రామాల్లో విఘ్నేశ్వరుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.



ఎడ్ల అరకలతో వెళుతున్న రైతన్నలు

# రమణీయంగా గోపాలుని రథోత్సవం

**యద్దనపూడి:** మండలంలోని పూనూరులో వేంచేసియున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం అంగరంగవైభవంగా జరిగింది. ప్రతి ఏడాది ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని స్వామి వారికి కళ్యాణ మహోత్సవాన్ని గ్రామస్తులు నిర్వహించి అనంతరం రథోత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. కోలాటాలు, భజన బృందాలు స్వామివారి సంకీర్తన నడుమ రథోత్సవ వేడుక కమనీయంగా సాగింది. ముదిరాజ్ సంఘం వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దివి భావనాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సీఐ ఫిరోజ్, ఎస్ఐ అనూక్ తమ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర, ఈఓ నాగయ్య పర్యవేక్షించారు.



శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథోత్సవం

### గ్రంథ పఠనంతో విజ్ఞానం పెంపు

**చీరాల అర్బన్:** విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి గ్రంథ పఠనం చేయడం వలన విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు ఆటలు, స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు నిర్వహించారు. గ్రంథాలయానికి రావడం వలన గ్రంథపఠనం చేసి జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చన్నారు.

### చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

**వేటపాలెం:** చీరాల– ఒంగోలు ప్రధాన రహదారిలో రామానగర్ వద్ద హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ వేసవి రోహిణి కార్తె ఎండల తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. పాదచారులు, వాహన చోదకులు దాహార్తి తీర్చడానికి మజ్జిగ పంపిణీ చేశామని తెలిపారు. పిచ్చుక సూర్య నాగలక్ష్మి, పి. దుర్గా పద్మావతి, పింజల సురేంద్ర, అసోసియేషన్ సభ్యులు గుగ్గిలం శ్రీహరి, మదు, పిచ్చుక బావరాజు, దర్గా పద్మావతి పాల్గొన్నారు.

### ఏకగ్రీవంగా పాలకవర్గం ఎన్నిక



నూతన పాలక వర్గం

**అద్దంకి:** పట్టణంలోని శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి పాలక వర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీంగా నిర్వహించారు. కార్యక్రమం దేవాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికలో గౌరవ అధ్యక్షునిగా కొండముది బాపూజీ, అధ్యక్షునిగా దాచేపల్లి పెదరాము, ఉపాధ్యక్షునిగా దాచేపల్లి వెంకట మారుతి, కార్యదర్శిగా కొండముది ఆంజనేయులు, ఉప కార్యదర్శిగా కొండముది ఆంజనేయులు, కోశాధికారిగా బహునాధం శ్రీనివాసరావు, ఉప కోశాధికారిగా ఫనిదెం శ్రీనివాసరావును ఏకగ్రీంగా ఎన్నుకున్నారు.

# అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే కరణం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి

**చీరాల:** పట్టణ పరిధిలోని దండుబాట నుంచి స్వర్ణ రోడ్డు వెళ్లే మార్గంలో జరుగుతున్న డ్రైనేజీ పనులు ఆదివారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరిశీలించారు. వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈఈ మురళీకృష్ణ, డీఈ డి.వి సుబ్బారావు, జేఈలు, చిట్టివాద రైతులున్నారు.

### వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్

**బల్లికురవ:** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు వారం రోజులుగా వైద్యశాలలో చికిత్స పొందుతుండగా వలంటీరు 65 కిలోమీటర్లు ఆదివారం వెళ్లి పింఛన్ అందజేశాడు. కొప్పరపాలెం గ్రామానికి చెందిన కోడెల అంజయ్య గుంటూరులోని ఓ ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సర్పంచ్ వీ.అమల, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, ఈవోఆర్డీ జి. సీతామహాలక్ష్మి, సెక్రటరీ వి. కోటేశ్వరరావు వలంటీర్‌ను అభినందించారు.

# శిడి మహోత్సవం ఆదాయం రూ. 2.12 లక్షలు

**వేటపాలెం:** రామన్నపేట శివారులోగల కనక నాగవరపమ్మ అమ్మవారి శిడి మహోత్సవం సందర్భంగా హుండీ కానుకలు, ప్రత్యేక దర్శనం, సర్వ దర్శనం ద్వారా రూ. 2,12,770 లక్షలు వచ్చినట్లు బాపట్ల దేవాదాయ ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. హుండీ కానుకల ద్వారా రూ. 82,424 వేలు, విరాళాలు, షాపులు అద్దెలు, పసుపు, కుంకుమ కానుకలు, ప్రత్యేక దర్శనం, సర్వదర్శనం ద్వారా రూ. 1,30,446 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈఓ జీవీఎల్ కుమార్, శ్రీనివాస్, ఫణికుమార్, పావని సంజీవి రావు, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

# దాడులకు ప్రతి దాడులు వద్దు



యద్దనపూడిలో మాట్లాడుతున్న సీఐ ఫిరోజ్

**యద్దనపూడి:** దాడులకు ప్రతి దాడులు ఆమోద యోగ్యం కాదని మార్టూరు సీఐ ఫిరోజ్ సూచించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు యద్దనపూడి, చింతపల్లిపాడు, పోలూరులో శాంతి సమావేశాలు ఏర్పాటు చేశారు. చిన్న గొడవలు పడి కేసులు నమోదైతే భవిష్యత్‌లో చాలా సమస్యలు వస్తాయని వారి పిల్లలు విదేశాలకు వెళ్లడం కుదరదన్నారు. పర్చూరు ఎస్ఐ ఎన్. చెంచు ప్రసాద్, మార్టూరు ఏఎస్ఐ షేక్ సైదా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

**యర్రగొండపాలెం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. కళాశాలలో తొలి బ్యాచ్ 1976–78 నుంచి 1980–82 సంవత్సరాల్లో చదివిన విద్యార్థులు స్థానిక మాచర్ల రోడ్డులోని షాదీఖానాలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొని పట్టణ ప్రజల మన్ననలు పొందారు. ఆయా సంవత్సరాల్లో చదివిన 90 మంది తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి అలనాటి జ్ఞాపకాలు పంచుకున్నారు. వీరిలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, ఉద్యోగ విరమణ చేసిన వారు, వ్యాపారాల్లో స్థిరపడిన వారు ఉన్నారు. ముందుగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు, ప్రభుత్వ కళాశాల మంజూరుకు కారకుడైన వేగినాటి కోటయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా తాము చదివిన జూనియర్ కళాశాల వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి షాదీ ఖానా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఉత్తమ విద్యార్థినికి నగదు పురస్కారం

**చీరాల రూరల్:** ఈ ఏడాది పదో తరగతిలో 584 మార్కులు సాధించిన బసవ భావన అనే విద్యార్థినిని ఆదివారం స్థానిక ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ ఆవరణలో చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. రూ. 10,516 నగదుతో పాటు రెండు జతల కొత్త బట్టలు, జ్ఞాపిక, పండ్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తవ్వా కృష్ణ మోహనరావును కూడా సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణలు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇదే విధంగా మంచి క్రమ శిక్షణతో చదివి ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వలివేటి మురళి కృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్, గుర్రం బధరి, ఎస్ఎస్. శ్రీనివాస్, డేగల తిరుపతిరావు, చారుగుళ్ల ప్రసాద్, దరియా సాహెబ్, దండా నారాయణ, వెంకటస్వామి, సుధాకరరావు, ఎం. సత్యనారాయణ (ఎంఎస్) మున్సిపల్ కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ, భావన కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.



భావనను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



వాడరేవు సముద్రంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు



వాడరేవు తీరంలో మన్నులో సేదతీరుతూ ఆనందంగా గడుపుతున్న చిన్నారులు

# తీరంలో సండే సందడి

**చీరాల టౌన్:** మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. వేసవి సెలవులు కావటంతో వివిధ జిల్లాలకు చెందిన ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చీరాల, పర్చూరు, అద్దంకి, ప్రత్తిపాడు, గుంటూరు, చిలకలూరిపేట, నర్సరావుపేట ప్రాంతాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు వాహనాల్లో తమ కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించి తీరంలో సందడిచేశారు. తీరం ఒడ్డున యువకులు, మహిళలు చిన్నారులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు.